ప్రజాశక్తి
గురువారం 31 అక్టోబరు 2024
5
శ్రీకాకుళం

ప్రముఖుల దీపావళి శుభాకాంక్షలు

శ్రీకాకుళం అర్బన్, కోటబొమ్మాళి : జిల్లా ప్రజలకు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వేర్వేరు ప్రకటనల్లో దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ అందరి జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని, కష్టాలనే చీకట్లు తొలగి వెలుగులు నిండిపోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు. పర్యావరణ అనుకూల దీపావళిని ప్రతిఒక్కరూ చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. ప్రకృతి మనుగడకు విఘాతం కలిగించే విధంగా పండగ చేసుకోవడం అంటే సంస్కృతికి మరింత ప్రాధాన్యం ఇచ్చిన వారమవుతామని పేర్కొన్నారు. తగు జాగ్రత్తలు పాటించి దీపావళి పండగ చేసుకోవాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. అందరి జీవితాల్లో దీపావళి వెలుగులు నిండాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సిఎం సారూ.. సమస్యలు వినరూ...

- ఏళ్ల తరబడి పెండింగ్‌లో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు
- జీడి మద్దతు ప్రకటన కోసం రైతాంగం ఎదురుచూపులు
- ఆధునీకరణకు నోచుకోని వంశధార ఎడమ కాలువ
- సిఐడి కేసులతో అపరిష్కృతంగా షట్టర్ల సమస్య
- రేపు సిఎం చంద్రబాబు నాయుడు జిల్లాకు రాక
- ఈదుపురంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభం



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాకు ఆయన రావడం ఇదే తొలిసారి. ప్రభుత్వం ఏర్పాటై వంద రోజుల పూర్తయిన సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట కవిటి మండలం రాజపురంలో రచ్చబండ ప్రారంభ కార్యక్రమానికి గత నెల 20వ తేదీన రావాల్సి ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో పర్యటన రద్దయింది. ఇప్పుడు ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఇచ్ఛాపురం మండలంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ఆయన ప్రారంభించనున్నారు. జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలు, కొత్త వరాలతో పాటు జిల్లాలో ఏళ్ల తరబడి నెలకొన్న అపరిష్కృత అంశాలపై సిఎం ప్రకటనలపై అంతా ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. వంశధార, ఆఫ్‌షోర్‌లను గత ప్రభుత్వం ప్రాధాన్యతా ప్రాజెక్టుల జాబితాలో చేర్చినా, పనులు మాత్రం ఆశించిన స్థాయిలో జరగలేదు. నిధులు విడుదల చేయకపోవడంతో సకాలంలో పూర్తి కాని పరిస్థితి నెలకొంది. వంశధార, నాగావళి నదుల అనుసంధాన పనులూ నత్తనడకనే సాగుతున్నాయి. వంశధార, నాగావళి వరదల నుంచి రక్షణ కల్పించేందుకు నిర్మించ తలపెట్టిన కరకట్టల పనులపై అధికారులు పలుమార్లు పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం కనీసం ఆమోదమూ తెలపలేదు. ప్రధాన సాగునీటి ప్రాజెక్టులతో పాటు నదుల అనుసంధాన పనులు ఈ ఏడాదిలోనైనా పూర్తయితే కొంతవరకైనా సాగునీటి సమస్యలు తీరే అవకాశం ఉండడంతో, ప్రాజెక్టుల పూర్తిపై రైతులు ఆశలు పెట్టుకుంటున్నారు.

ఆధునీకరణకు నోచని వంశధార కాలువలు

వంశధార ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన నాటి నుంచి కాలువల ఆధునీకరణ పనులకు నోచుకోలేదు. ప్రధానంగా ఎడమ కాలువ పరిస్థితి దయనీయంగా ఉంది. బ్యారేజీలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్న రోజుల్లోనూ 1600 క్యూసెక్కులకు మించి విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. ఆధునీకరణ పనులకు రూ.834 కోట్లు అవసరమని 2021-22 కొత్త ఎస్ఎస్ఆర్ (షెడ్యూల్ స్టాండర్డ్ రేట్స్)తో నివేదికను గతేడాది పంపారు. ఏడాది గడిచినా ఇప్పటివరకు ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. గొట్టాబ్యారేజీ కుడి ప్రధాన కాలువదీ అదే దుస్థితి. కాలువ గట్లు కోతకు గురయ్యే ప్రాంతంలో సిసి లైనింగ్ పనుల కోసం 2021-22లో రూ.18.45 కోట్ల అంచనాలతో రూపొందించిన ప్రతిపాదనలూ పెండింగ్‌లోనే ఉన్నాయి.

షట్టర్ల సమస్యకు చూపాలి ఓ పరిష్కారం

వంశధార శివారు భూముల సాగునీటికి షట్టర్ల కుంభకోణం కేసు అడ్డంకిగా మారింది. షట్టర్ల కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై 2009లో సిఐడి కేసు నమోదు చేసింది. దీనిపై నేటికీ హైకోర్టులో విచారణ సాగుతోంది. ఘటన జరిగి 13 ఏళ్లు అవుతున్నా, నేటికీ విచారణ ఒక కొలిక్కి రాలేదు. విచారణ పెండింగ్‌లో ఉండడంతో, కాలువలపై కొత్త షట్టర్లను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. సాగునీటి సలహా మండలి, జిల్లా సమీక్షా కమిటీ సమావేశాలు తదితర సందర్భాల్లో జలవనరులశాఖ అధికారులు పలు పర్యాయాలు ప్రస్తావిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. దీనిపై సిఎం స్పందిస్తే షట్టర్ల సమస్య తీరనుంది.

మత్స్యకారులకు ఒక్క కోల్డ్ స్టోరేజీ లేని వైనం

జిల్లాలో 193 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్ర తీరం ఉన్నా ఎక్కడా కోల్డ్ స్టోరేజీ లేదు. దీంతో మత్స్యకారులు ఏ రోజు మత్స్య సంపదను ఆ రోజే అమ్ముకోవాల్సి వస్తుండడంతో సరైన ధర దక్కడం లేదు. పాలకులు మారుతున్నా కోల్డ్ స్టోరేజీ నిర్మాణం మత్స్యకారులకు నెరవేరని కోరికగానే మిగిలింది. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం, వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. తమ పిల్లలను చదివించుకునేందుకు ఆశ్రమ పాఠశాల కావాలని మత్స్యకారులు చాలాకాలంగా కోరుతున్నారు.

పలాస కిడ్నీ ఆస్పత్రిలో అంతంతమాత్రమే సేవలు

కిడ్నీ సూపర్ స్పెషాలిటీ సేవలకు సంబంధించి మొత్తం 60 మంది వైద్యులను భర్తీ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 56 మందిని నియమించారు. కీలకమైన నెఫ్రాలజీ విభాగానికి మూడు పోస్టులను భర్తీ చేయాల్సి ఉండగా, ఒక్కరిని మాత్రమే నియమించి మరో రెండు పోస్టులను ఉద్యోగోన్నతి ద్వారా భర్తీ చేయనున్నారని తెలిసింది. నర్సింగ్ సేవల కోసం 60 మంది సిబ్బంది అవసరం కాగా 46 మందిని నియమించారు. ఆసుపత్రిలో 40 మంది సహాయ సిబ్బంది అవసరం కాగా 15 మందిని నియమించారు. ఆపరేషన్ థియేటర్‌లో 20 శాతం మేర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంకా సమకూర్చుకోవాల్సి ఉంది. రీసెర్చ్‌కు సంబంధించిన పరికరాలు రాకపోవడంతో, ప్రస్తుతానికి మాత్రం కొంతవరకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందనున్నాయి.

జీడి మద్దతుపై ప్రకటన ఉంటుందా?

జిల్లాలో ఉద్దాన ప్రాంత జీడి రైతులకు ఏటా కష్టాలు తప్పడం లేదు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టపోతున్న పరిస్థితి ఉంది. జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించాలని, రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలంటూ ఐదేళ్లుగా జీడి రైతులు పలురూపాల్లో ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. గత వైసిపి ప్రభుత్వం, మంత్రులు ఇదిగో అదిగో మద్దతు ధర ప్రకటిస్తామంటూ మోసపుచ్చారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా నాడు జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటిస్తామని హామీనిచ్చారు. దీనిపై ఉద్దానం రైతాంగం ముఖ్యమంత్రి ప్రకటన కోసం ఎదురుచూస్తోంది.

ఐటిడిఎ ఏర్పాటుపై ప్రకటన ఉంటుందా?

జిల్లాల పునర్విభజన తర్వాత సీతంపేట ఐటిడిఎ పార్వతీపురం మన్యం జిల్లాలో చేరడంతో, జిల్లాకు చెందిన గిరిజనులు రెండింటికీ చెడ్డ రేవడిలా మారారు. ఐటిడిఎకు సంబంధించి నిర్ణయాలు అమలు చేసే వ్యవస్థ పార్వతీపురం మన్యం జిల్లాలో ఉండడంతో, ఇక్కడి గిరిజనులకు తలెత్తిన ఏ సమస్యనూ పరిష్కరించే పరిస్థితి ఉండడం లేదు. జిల్లాలోని గిరిజన గ్రామాలను కలెక్టర్ సందర్శించినా, గిరిజనుల వినతులను అక్కడికే పంపాల్సి ఉంటుంది తప్ప సొంతంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం లేకపోవడంతో సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. ఎన్నికల సందర్భంగా పలాస సభలో జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ అమలు కోసం గిరిజనులు ఎదురుచూస్తున్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. తొలుత ఈదుపురంలోని పలు గృహాలను సందర్శించి మహిళలతో మాట్లాడనున్నారు. అనంతరం ఈదుపురం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన సభాస్థలికి చేరుకుని బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. బహిరంగ సభలో ముగ్గురు మహిళలకు నగదు బదిలీ పథకం కింద డబ్బులను అందించి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈదుపురంలో ఉచిత సిలిండర్ల పథకానికి 1427 మంది అర్హులుగా అధికారులు గుర్తించారు. సిఎం రాక సందర్భంగా పోలీసులు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

సిఎం సభాస్థలి పరిశీలన

ఇచ్ఛాపురం : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనా ఏర్పాట్లను, సభాస్థలిని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్‌డిఒ వెంకటేష్, ఇతర అధికారులు బుధవారం పరిశీలించారు. ఏర్పాట్లకు సంబంధించి పలు సూచనలు చేశారు. హెలీప్యాడ్ నిర్మాణం, జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష, లబ్ధిదారులతో ముఖాముఖి, బహిరంగ సభకు ముమ్మర ఏర్పాటు చేస్తున్నారు. ఈదుపురంలో యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపడుతున్నారు. సభా వేదిక వద్ద కొత్తగా విద్యుత్ స్తంభాలు, వైర్లు ఏర్పాటు చేస్తున్నారు.

పేలుతున్న టపాసుల ధరలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, పలాస

బాణసంచా సామగ్రిని కొనుగోలు చేస్తున్న ప్రజలు

దీపావళి వచ్చిందంటే చాలు చిన్నారుల నుంచి పెద్దల వరకు ఒకటే సందడి. బాణసంచా కొనుగోలు చేసి ఇంటిల్లిపాదీ సంతోషంగా పండగ చేసుకుంటారు. ఆ ఆనందాన్ని అధిక ధరలు దూరం చేస్తున్నాయి. వ్యాపారులు ధరలను విపరీతంగా పెంచేస్తున్నారు. దీంతో టపాసులు కొనుగోలు చేయాలంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. అసలు ధరకు రెట్టింపునకు పెంచి అమ్మకాలు చేపడుతుండడంతో, ఏవో కొన్ని కొనుక్కొని వెనుదిరిగే పరిస్థితి నెలకొంది. మరోవైపు బాణసంచా విక్రయాలకు అనుమతులు పొందిన దుకాణాలు కొన్నే కాగా, అనధికారికంగా విక్రయిస్తున్న దుకాణాలు మాత్రం ఎక్కువగా ఉన్నాయి.

జిల్లాలోని 30 మండలాల పరిధిలో 94 బాణసంచా దుకాణాలకు తాత్కాలిక లైసెన్స్‌లు మంజూరు చేశారు. శ్రీకాకుళం నగరంలో 21 రిటైల్ షాపులను ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేశారు. బుధ, గురువారాల్లో విక్రయాలకు అనుమతులు ఇవ్వడంతో రిటైల్ షాపుల వద్ద సందడి ప్రారంభమైంది. అధికారుల నుంచి అనుమతులు తీసుకున్న వ్యాపారులు వాటిని ఏర్పాటు చేసి అమ్మకాలను ప్రారంభించారు. షాపుల వద్దకు టపాసులు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో రద్దీగా మారింది. సామాన్య, మధ్యతరగతి వారంతా రిటైల్ షాపుల వద్దకే వచ్చి కొంటున్నారు. గతేడాదితో పోల్చి చూస్తే టపాసుల ధరలను భారీగానే పెంచేశారు. దానా తుపాను ప్రభావం ఉంటుందని భయపడిన వ్యాపారులకు వాతావరణం అనుకూలించింది. దీంతో రూ.కోట్లలో వ్యాపారం సాగుతోంది. వీటితో పాటు జిల్లావ్యాప్తంగా తాత్కాలిక మందుగుండు విక్రయాలకు అధికారులు అనుమతిచ్చారు. మరోవైపు విజయనగరం, ఒడిశా రాష్ట్రంలోని పర్లాకిమిడి ఇతర ప్రాంతాల నుంచి కొందరు మందుగుండు సామగ్రిని ముందుగానే తెచ్చుకుని నిల్వ చేసుకుని విక్రయిస్తున్నారు.

గతేడాది కంటే రెట్టింపు ధరలకు అమ్మకాలు

గతేడాది రూ.1300 పలికిన ఫ్యామిలీ ప్యాక్ ధర ఈ ఏడాది రూ.రెండు వేల వరకు అమ్ముతున్నారు. గతేడాది తారాజువ్వల ప్యాకెట్ రూ.40కు అమ్మితే ఈ ఏడాది రూ.వందకు విక్రయిస్తున్నారు. చుచ్చుబుడ్డులు రెండు రూ.50 నుంచి రూ.వందకు పెంచేశారు. క్రాకర్లు గతేడాది రూ.30 ఉంటే... ఈ ఏడాది రూ.80, లక్ష్మీ బాంబులు రూ.110 ఉంటే... ప్యాకెట్ రూ.250కు పెంచేశారు. వీటిని కొనుగోలు చేసేందుకు వెళ్లిన వారి ధరలను చూసి కళ్లు తేలేస్తున్నారు.

అనుమతులు తక్కువ... విక్రయాలు ఎక్కువ

రెవెన్యూ, అగ్నిమాపక, జిఎస్‌టి, పోలీస్, మున్సిపాలిటీ, మండల పరిషత్ అధికారులకు బాణసంచా దుకాణాలు పెట్టుకొనేందుకు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోగా, తాత్కాలిక అనుమతులు ఇచ్చారు. వ్యాపారులు సుమారు 25 కేజీలు మాత్రమే బాణాసంచా తీసుకువస్తామని చెప్పి అందుకు సంబంధించిన అనుమతులు చూపిస్తూ టన్నుల కొద్దీ బాణాసంచా తీసుకొచ్చి విక్రయాలు చేపడుతున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా ఎవరికి అందాల్సినవి వారికి అందడంతో మిన్నకుంటున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. అనుమతులు, నిర్వహణా వ్యయంతో పాటు ఇతర చెల్లింపులు చేయాల్సి ఉంటుందని, అందుకే ధరలు పెంచక తప్పడం లేదని దుకాణ నిర్వాహకులు చెప్తున్నారు. ఈ పేరిట అధిక ధరలతో సొమ్ము చేసుకుంటున్నారని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు.

నాగావళి నదీ తీర సమగ్రాభివృద్ధే ధ్యేయం

- పార్కుల సుందరీకరణకు చర్యలు
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



నాగావళి రివర్ వ్యూ పార్కును పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నగరం లోని నాగావళి నదీ తీర ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. అందుకనుగుణంగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆదేశించారు. నాగావళి నది సమగ్రాభివృద్ధి ప్రాజెక్టు (సిఎన్‌ఆర్‌డిపి) అమల్లో భాగంగా బలగ జంక్షన్ నుంచి కలెక్టర్ బంగ్లా వరకు గల నాగావళి నదీ పరీవాహక ప్రాంతాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌తో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా నాగావళి రివర్ వ్యూ పార్క్ సహా డైమండ్ పార్క్, పి.ఎన్ కాలనీలోని జన్మభూమి పార్కులను పరిశీలించారు. నగరంలోని అన్ని పార్కులను సుందరీకరించి, ప్రజలకు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

132 కె.వి అభివృద్ధి పనులపై సమీక్ష

నగరంలోని పార్కుల సుందరీకరణ చర్యల్లో భాగంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్థానికులతో మమేకమయ్యారు. వారితో మాట్లాడి, సుందరీకరణపై చర్చించారు. అనంతరం నగరంలోని 132 కె.వి విద్యుత్ లైన్ అభివృద్ధి పనులపై అధికారులతో కలిసి సమీక్షించారు. నగరాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనకు పటిష్ట చర్యలు

అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

నవంబరు ఒకటో తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. మండలంలోని నిమ్మాడలో గల తన క్యాంపు కార్యాలయం నుంచి ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్‌తో పాటు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి మహేశ్వర రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఇచ్ఛాపురం మండలంలోని ఈదుపురంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకాన్ని సిఎం ప్రారంభించనున్న నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి లోటుపాట్లూ తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఏ చిన్న విషయంలోనూ అలసత్వం, నిర్లక్ష్యం వహించేందుకు వీల్లేదన్నారు. సభా వేదిక వద్ద జనం గుమిగూడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రతా బలగాలు అణువణువూ గాలించి ఏ చిన్న అనుమానం వచ్చినా ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. సిఎం పర్యటనకు స్వచ్ఛందంగా జనం వచ్చేందుకు పుష్కలంగా అవకాశాలు ఉన్నందున సంబంధిత వర్గాలకు ఏ ఇబ్బందీ లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రోటోకాల్ నిబంధనలు పాటిస్తూ జిల్లా ప్రజాప్రతినిధులు, ఇతర ప్రాంత ప్రతినిధులను పోలీసులు సభా ప్రాంగణాన రిసీవ్ చేసుకోవాలని సూచించారు. ఎవరినీ ఇబ్బంది పెట్టవద్దని, నిబంధనల మేరకు వాహనాలను అనుమతించాలన్నారు.

పోలీసు అమరవీరులకు జోహార్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు కొవ్వొత్తుల ప్రదర్శనతో ఘనంగా నివాళ్లర్పించారు. పోలీసు అమరవీరుల స్మారకోత్సవాల్లో అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యాన పోలీసు అధికారులు, సిబ్బంది స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిఎస్‌పి వివేకానంద ప్రారంభించారు. పోలీసులు కవాతు చేసుకుంటూ దేశభక్తి గీతాలతో డే అండ్ నైట్ కూడలి మీదుగా ఏడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ సాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి అమరవీరులకు జోహార్లు తెలుపుతూ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి వివేకానంద మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ నుంచి అమరవీరుల స్మారకోత్సవాలు విజయవంతంగా నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా వ్యాసరచన పోటీలు, వైద్య శిబిరాలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. శాంతియుత సమాజ స్థాపనలో భాగంగా ఈ ఏడాది దేశంలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఈ కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సిఐలు అవతారం, ఉమామహేశ్వరరావు, పైడిపు నాయుడు, ఆర్ఐ నర్సింగరావు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, ఎన్‌సిసి కేడెట్లు తదితరులు పాల్గొన్నారు.

నాగావళి గట్టుపై రోడ్డుకు ప్రతిపాదనలు

కాలినడకన పరిశీలించిన ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరం నడిబొడ్డున ప్రవహిస్తున్న నాగావళి నది పరివాహక ప్రాంతం వెంబడి ఇరువైపులా రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు చర్యలు ప్రారంభించారు. అందులో భాగంగా తొలి విడతగా హెచ్‌బి కాలనీ నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ఉన్న రెండున్నర కిలోమీటర్ల పొడవునా రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి పాతవంతెన వరకు నాగావళి నది వెంబడి బుధవారం రెండున్నర కిలోమీటర్ల మేర కాలినడకన పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నది గట్టుపై రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే కలెక్టర్ కమిషనర్లతో చర్చించామని, త్వరలోనే ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. అనుమతులు రాగానే రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. ఈ రోడ్డు పూర్తయితే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రయాణించే అవకాశం కలుగుతుందన్నారు. ఈ రోడ్డు మీదుగా కలెక్టరేట్‌కు వెళ్లేందుకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉంటుందన్నారు. త్వరితగతిన ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

సక్రమంగా పనిచేయకుంటే తప్పుకోండి

వజ్రపుకొత్తూరు : సక్రమంగా పనిచేయకుంటే విధుల నుంచి తప్పుకోవాలని డ్వామా పీడీ బి.సుధాకరరావు అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం ఆవరణలో ఎంపిడిఒ రమేష్ నాయుడు అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజా వేదికను బుధవారం నిర్వహించారు. పంచాయతీ వారీగా మస్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరును సామాజిక తనిఖీ బృందం సభ్యులు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మస్టరులో ఎక్కువగా దిద్దుబాట్లను గుర్తించారని, ఇలాంటివి మళ్లీ తలెత్తకుండా జాగ్రత్త వహించాలని సిబ్బందికి సూచించారు. వచ్చే ఏడాది సోషల్ ఆడిట్‌కు సిబ్బందికి తప్పులు వెతికే అవకాశం ఇవ్వకూడదన్నారు. అందరూ తమ పనులు సక్రమంగా నిర్వహిస్తే నిర్భయంగా సోషల్ ఆడిట్‌కు హాజరు కాగలరని చెప్పారు. మండలంలో ఉపాధి హామీ, పంచాయతీరాజ్, నీటిపారుదల, సర్వశిక్షా అభియాన్‌కు సంబంధించి 1298 పనులు చేపట్టారు. వీటికోసం రూ.13.6 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఏడాదికి 7,500 కంటే తక్కువ పనిదినాలు నమోదైతే ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివిపి స్వరూపరాణి, ఎపిడిలు రాధ, శైలజ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ సుధాకరరావు

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
I.P: 16 /2024

Between
1. Potnuru Anil Kumar @ Anil
2. Potnuru Roja ...Petitioners.
And:-
Nakka Devananda Kumar & Others ....Respondents
To,
1) Nakka Devananda Kumar
2) Sirugudi Nagabusahana Rao
3) Dabbiru Manojkumar
4) Tangudu Suseela

యావన్మంది ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా పై నెంబరు కేసును పిటీషనర్ను Insolvent గా డిక్లర్ చేయమని కోరుచూ పై కోర్టులో ఫిటీషన్ ను దాఖలు చేసినారు. కావున ఎవరికి ఏ విధమైన అభ్యంతరములు ఉన్న యెడల **తే॥ 04-11-2024 దిన ఉ॥10-30 గం॥ లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల అక్షేపణలు తెలియపర్చుకొనవలెను. లేని యెడల పిటీషనర్‌కు అనుకులంగా తీర్మాణించడమగునని ఇందుమూలంగా తెలియ పర్చుడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులను అనుసరించి)

కె. శంకరరావు
న్యాయవాది,
శ్రీకాకుళం, 9491567435.

IN THE HONOURABLE COURT OF PRINCIPAL SENIOR CIVIL JUDGE, AT SRIKAKULAM
O.S: No. 97/2016.

Between:**Mosa Rajababu.** ....Plaintiff
And: **Mosa Rama Rao and others.** .....Defendants.
To,
D-9: Korada Chandra Kumar, W/o late Govinda Rajulu, aged 61years, R/o 2-354.. Korada Veedhi, Srikurmam Village & Post, Gara Mandal, Srikakulam district.
D-10: Korada Santosh Kumar, S/o late Govinda Rajulu, aged 41years, R/o 2-354.. Korada Veedhi, Srikurmam Village & Post, Gara Mandal, Srikakulam district.

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా, పై నంబరుగల దావాలో మీకు నోటీసులు కోర్టు ద్వారా ఎన్నిసార్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీరు **తేదీ 05-11-2024 న ఉదయం: గం॥10-30 ని॥** లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరు కాబడి మీ వాదనలు తెలియజేసుకొనవలెను. లేనిచో సదరు దావా మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలియ జేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులను అనుసరించి)

పి.యస్. గాంధీ
న్యాయవాది,
శ్రీకాకుళం, సెల్: 9848063543.

BEFORE THE HONOURABE COURT OF THE DISTRICT CONSUMER FORUM AT SRIKAKULAM
CC: No. 52/2024

Between;
Rama Appala Naidu .....Complainant
And: **Sri Shaurya Developers** rep.. by its Managing Partner, Mr. Potnuru Venkata Srinivasa Chandra Bhushanam & Another. .....Opposite Parties
To,
Op.No:1 Sri Shaurya Developers, rep.. by its Managing Partner, Mr. Potnuru Venkata Srinivasa Chandra Bhushanam S/o Siva Prasad, New Bridge road, Besides Vishal mart, 1st floor, Srikakulam, age 26 years, R/at C/o 1st floor of Korada Pentayya Master's House, Opp. to Maruthi Timber Depot, Satyasai Nagar (Varam Colony), Balaga Junction, Srikakulam district.
Op.No:2 Potnuru Siva Prasad, S/o Kamayya, Aage 57 years --rest do--

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా, పై నంబరుగల కేసులో మీకు నోటీసులు కోర్టు ద్వారా ఎన్నిసార్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీరు **తేదీ 07-11-2024 న ఉదయం: గం॥10-30 ని॥** లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరు కాబడి మీ వాదనలు తెలియజేసుకొనవలెను. లేనిచో సదరు కేసు మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలియ జేయడమైనది.

పిన్నింటి బాలక్రిష్ణ రావు
న్యాయవాది,
శ్రీకాకుళం, సెల్: 8639446373

చికిత్స పొందుతున్న అప్పలరాజు

మాజీ మంత్రి అప్పలరాజుకు అస్వస్థత

ప్రజాశక్తి- పలాస

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అస్వస్థతకు గురయ్యారు. బుధవారం ఉదయం తన ఇంట్లో అధిక సమయం జిమ్ చేయడంతో అస్వస్థతకు గురయ్యారు. తక్షణమే స్పందించిన కుటుంబ సభ్యులు ఆందోళన చెందడంతో స్వతహాగా వైద్యులు కావడంతో శ్రీకాకుళం మెడికవర్ వరకు వెళ్లి గుండె సంబంధిత (యాంజి(గ్రాం), సిటీ స్కాన్ పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యం నిలకడగా ఉన్నప్పటికీ అబ్జర్వేషన్‌లో ఉంచినట్టు గుండె సంబంధిత వైద్య నిపుణులు అన్నాజీరావు తెలిపారు.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీడీ సుధాకరరావు

‘ఉపాధి’ నిధులతో అభివృద్ధి పనులు

డ్వామా పీడీ సుధాకరరావు

ప్రజాశక్తి- పలాస

ఉపాధి హామీ నిధులతో పల్లెలకు మహర్దశ అని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకరరావు తెలిపారు. మండలంలోని లక్ష్మీపురంలో రూ.14 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిమెంట్ కాంక్రీట్ రోడ్డు పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెల్లో రహదారులు, కాలువలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పరిశుభ్రకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు కూడా మెరుగవుతాయన్నారు. జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున మెటీరియల్ కాంపొనెంట్ పనులను చేపడుతున్నామని తెలిపారు. ఈ పనుల్లో నాణ్యతకే అగ్రతాంబూలం వేస్తామన్నారు. పనులను నిరంతరం పర్యవేక్షించాలని, ఎప్పటికప్పుడు నివేదికను కార్యాలయానికి అందించాలని సిబ్బందికి ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పనులన్నీ వీలైనంత తొందరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ నారాయణరావు, ఇసి అమ్మినాయుడు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్యంతోనే అధిక దిగుబడులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సమగ్ర యాజమాన్యంతోనే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల ఎఒ మెట్ట మోహనరావు అన్నారు. మండలంలోని బెలమంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా వరి పంట పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంట పొలంలో తెల్ల దోమ, నల్ల దోమ బీడపీడలను పరిశీలించారు. తెల్ల దోమ నివారణకు బుప్రోఫిజన్ 320 గ్రాములు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో రైతులతో సభను నిర్వహించారు. రబీ క్రాప్ ఇన్సూరెన్స్ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ టి.మాధురి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన

సోంపేట : సోంపేట పట్టణంలో శ్రీవాస విద్య నిలయం విద్యార్థులకు బుధవారం మండల వ్యవసాయశాఖ అధికారి నరసింహమూర్తి వ్యవసాయంపై అవగాహన కలిగించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా చేపట్టిన కార్యక్రమానికి విద్యార్థులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా వ్యవసాయం చేసే పద్ధతులు, రైతుల అనుభవాలు, ప్రభుత్వ సహాయంపై తెలియజేశారు.

విత్తన శుద్ధి అవసరం

పోలాకి : వేరు శనగ పంట అధిక దిగుబడి రావాలంటే విత్తన శుద్ధి అవసరమని మండల ఎఒ చిరంజీవి సూచించారు. మండలంలోని కుసుమపోలవలసలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేరుశనగలో విత్తనశుద్ధి కిలో విత్తనానికి 1.0 గ్రా టిబ్యుకొనజోల్, 3గ్రా మ్యాంకోజెబ్ పొడి మందును పట్టించాలన్నారు. కాండం కుళ్లు వైరస్ తెగులు ఆశించే ప్రాంతాల్లో కిలో విత్తనానికి 2 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ మందుతో విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. వేరు పురుగు ఉధృతి ఎక్కువగా ఉండే ప్రాంతమైతే కిలో విత్తనానికి 6.5 మి.లీ క్లోరిపైరిఫాస్, 2 మి.లీ ఇమిడ క్లోప్రిడ్ చొప్పున కలిపి శుద్ధి చేసుకోవాలన్నారు. వరిలో కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియచేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయకులు వెంకటేష్, సర్పంచ్ లక్ష్మీనారాయన, రాంబాబు, స్వామి, త్రినాథ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : రబీలో రైతులు సాగుచేసే వేరుశనగ విత్తనాలకు సాఫ్ అనుమందుతో విత్తనశుద్ధి చేసుకోవాలని టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు బి.వి.తిరుమల రావు, మండల వ్యవసాయశాఖ అధికారి ఎస్.గోవిందరావు తెలిపారు. మండలంలోని చీపుర్లపాడు పంచాయతీలో

కోటబొమ్మాళి : అవగాహన కల్పిస్తున్న తిరుమలరావు

పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

కవిటి: రైతులు తాము పండించే పంటలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బడగల దుర్గాప్రసాద్ అన్నారు. కవిటి మండలం లోల్లపుట్టుగ, కర్రివానిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సింహాచలం, అమూల్య, పశు సహాయకులు నీలవేణి పాల్గొన్నారు.

మందస : మండలంలోని హరిపురం, అంబగాం గ్రామాల్లో ఉద్యానవన శాఖ శంకర్‌దాస్ ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జగన్నాథపురం సర్పంచ్ పురుషోత్తం, ఎంపిటిసి అప్పన్న, భైరిశెట్టి గున్నయ్య, పశువైద్యాధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అధ్యక్షతన నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వినతులు వెల్లువెత్తాయి. ఈ దర్బారులో స్వయంగా 288 వినతులను ఎమ్మెల్యే స్వీకరించారు. కర్లెమ్మ పంచాయతీలోని హద్దుబంగి గెడ్డ చెక్‌డ్యామ్ పరీక్ష క్రితం వచ్చిన వరదలకు కొట్టుకుపోయిందని, దీంతో వెయ్యి ఎకరాలకు సాగునీరు కష్టంగా ఉందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శిర్ల ప్రసాద్ వినతిపత్రం అందజేశారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులో ఐదేళ్లుగా మురుగు నీరు ప్రవహిస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కర్లెమ్మ రెవెన్యూ పరిధిలో గత ప్రభుత్వం చేపట్టిన భూ రీ సర్వేలో దొర్లిన తప్పులను సరి చేయాలని అన్నారు. పారాపురంలో దళితులకు శ్మశాన వాటికకు రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు. గిరిన గ్రామాలకు రహదారులు నిర్మించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు బకాయిపడిన వేతనాలను చెల్లించాలన్నారు. కొత్తూరు అంగన్వాడీ-కేంద్రానికి శాశ్వత భవనాన్ని నిర్మించాలని కార్యకర్త ధనలక్ష్మి కోరారు. డిగ్రీ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, రైతుబజారు మంజూరు చేయాలని స్థానికులు కోరారు. వసపకు చెందిన వలరౌతు తిరుపతిరావుకు సిఎం సహాయ

వినతిపత్రం అందజేస్తున్న ప్రసాద్

నిధి రూ.3 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. రెవెన్యూ, గృహ నిర్మాణం, పంచాయతీరాజ్, ఐసిడిఎస్, విద్యుత్‌శాఖ సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి సవర సంజీవ్, వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, ఎంపిడిఒ అగతముడి భైరాగినాయుడు, అరుణకుమార్, మాధవరావు, మతాల గాంధీ, వై.దాసునాయుడు, తహశీల్దార్ రవిచంద్ర, ఎంపిడిఒ నీరజ, విద్యుత్‌శాఖ ఎఇ దుర్గాప్రసాద్, ఐసిడిఎస్ పిఒ విమలకుమారి, ఎఒ స్వర్ణలత, ఎఇ లక్ష్మణరావు, ఎపిఒ ప్రమలత, ఎపిఎం లలిత, డాక్టర్లు కిషోర్‌కుమార్, డాక్టర్ ప్రసన్నకుమార్, ఎంఇఒలు గోవిందరావు, శ్రీనివాస్, సిఎస్‌డిటి భీమారావు, ఎఇ బి.మోహనరావు, సిఐ ప్రసాదరావు, ఎస్ఐ ఎ.అహమ్మద్ పాల్గొన్నారు.

కబడ్డీ విజేత గొల్లమాకన్నపల్లి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని వడ్డివాడలో గౌరీనందీశ్వర ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా గొల్లమాకానపల్లికు చెందిన జెస్సీ జట్టు నిలిచింది. ద్వితీయస్థానం శ్రీకాకుళం జట్టు విజయం సాధించింది. కన్సిలేషన్ బహుమతులు నరసన్నపేట మండలం రావివలస జట్టు నిలిచింది. ప్రథమ బహుమతి సాధించిన గొల్లమాకన్నపల్లి జట్టుకు రూ.25 నగదు, షీల్డ్, ద్వితీయ స్థానంలో నిలిచిన శ్రీకాకుళం జట్టుకు రూ.18 వేలు నగదు, షీల్డ, కన్సోలేషన్ జట్లకు నగదు, షీల్డ్ అందజేశారు. బెస్టు ఆల్రౌండర్ లండ సంతోష్, బెస్టు డిపెండర్ రాపాక నవీన్‌లకు ప్రత్యేక అవార్డులు అందజేశారు. గెలుపొందిన చెట్లకు సర్పంచ్ గూట్ల మల్లేశ్వరరావు మాజీ సర్పంచ్ బాడన వసంతరావు చేతుల మీదుగా అందజేశారు.

షీల్డ్‌ను అందజేస్తున్న నిర్వాహకులు

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

దివ్య (ఫైల్)

టెక్కలి సబ్ కలెక్టరేట్ సమీపంలో నివాసం ఉంటున్న సంపతిరావు దివ్య (28) అనే వివాహిత బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ రాము తెలిపారు. ఆమె కొన్నాళ్లుగా మానసిక సమస్యలతో బాధపడుతుందన్నారు. వైద్యం చేయించుకుంటున్నా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఆమె భర్త శ్రావణ్ కుమార్ టెక్కలి తహశీల్దార్ కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై వ్యక్తి...

టెక్కలి : మండలంలోని నౌపడ ఆర్‌ఎస్ రైల్వేస్టేషన్‌కు సమీపంలో బుధవారం పాతపట్నానికి చెందిన శంకరరావు బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకుంటున్న రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

బావిలో పడి బాలుడు దుర్మరణం

ప్రజాశక్తి- పర్లాకిమిడి

చరణ్ మృతదేహం

గజపతి జిల్లా పర్లాకిమిడి సమీపంలోని రాజ్‌సీతాపూర్ స్కూల్ వద్ద ఉన్న బావిలో పడి చరణ్ బెహరా (అంజి) (10) బుధవారం రాత్రి దుర్మరణం చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది బాలుడి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం పర్లాకిమిడి జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాలుడు ఉదయం నుంచి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికులు నూతిలో మృతహాన్ని గుర్తించి సమాచారం అందజేశారు. బాలుడికి మతిస్థిమితం లేని వ్యక్తి అని గ్రామస్తులు తెలిపారు. మృతుడికి తల్లిదండ్రులు గణేష్ బెహరా, తల్లి దేవి బెహరా, చెల్లి ఉన్నారు. కుమారుడు మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఠాణా అధికారి రవీంద్రపాత్రో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం, వెండి స్వాధీనం

పర్లాకిమిడి : గజపతి జిల్లా మోహన పట్టణం ప్రధాన బజారులోని శ్రీహరి జూయలర్స్ దుకాణంలో ఈ ఏడాది సెప్టెంబరు 25న చోరీ జరిగిందని, దానిని రికవరీ చేశామని ఎస్‌పి జితేంద్రకుమార్ పండా తెలిపారు. ఈ మేరకు ఇద్దరు నిందితులను బుధవారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాం జిల్లాకు చెందిన ఆస్కార్, సభర్నపూర్‌కు జిల్లా చెందిన మరో వ్యక్తి కేజీ బంగారం, ఐదు కేజీల వెండి, రూ.70 వేలు నగదు చోరీకి పాల్పడ్డారని అన్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకుని వారి వద్ద నుంచి 400 గ్రాముల బంగారం, 30 కేజీల వెండి, రూ.40 వేలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

పాడె మోస్తున్న ఎమ్మెల్యే శంకర్

టిడిపి నాయకుడు దేవ్ మృతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

టిడిపి నాయకుడు, నగరంలోని 29 వార్డు ఇన్‌ఛార్జి కోలా శ్రీనివాసదేవ్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన గత కొంత కాలంగా కేన్సర్ వ్యాధితో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆయన స్వగృహానికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన పార్థవదేహానికి అంతిమ సంస్కారంలో పాల్గొన్న ఆయన పాడి మోసి ఆయనపై ఉన్న గౌరవాన్ని చాటుకున్నారు. పరామర్శించిన వారిలో తెలుగు యువత నాయకులు మెండ దాసునాయుడు, మాదారపు వెంకటేష్ ఉన్నారు.

‘జాగృతి’ దరఖాస్తుకు మంత్రి లోకేష్ స్పందన

ప్రజాశక్తి- సోంపేట



గణపతి

మండలంలోని కొర్లం జాగృతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామ్ బుడ్డి గణపతి గత నెల మంత్రి నారా లోకేష్‌కు విద్యార్థులు, రైతుల, సాధారణ ప్రజల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా విద్యార్థులకు అర్హులైన లబ్ధిదారులకు అవసరమైన ధ్రువపత్రాల జారీలో రెవెన్యూ అధికారుల అలసత్వంపై ప్రత్యేకంగా చూడాలని కోరారు. అలాగే రైతులు ప్రభుత్వ సహాయం పొందేందుకు అవసరమైన అడంగల్, ఇతర పత్రాల మంజూరులో కూడా అధికారులు ఇబ్బందులు కలిగిస్తున్న వైనాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన మంత్రి లోకేష్ తన పర్సనల్ అసిస్టెంట్ శ్రీనివాస్ ద్వారా జాగృతి దరఖాస్తుకు స్పందించి చర్యలు తీసుకుంటున్నట్లు తెలియచేశారు. విద్యార్థులకు, రైతులకు అవసరమైన ధ్రువపత్రాల మంజూరులో ఆలస్యం లేకుండా సంస్థ ద్వారా ప్రత్యేక ఒప్పందం చేసుకున్నట్లు తెలియజేశారు. త్వరలోనే అర్జీదారులకు అవసరమైన ధ్రువ పత్రాలన్నీ వాట్సాప్‌ల్లో వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు లోకేష్ చెప్పినట్టు గణపతి తెలిపారు. ఈ సందర్భంగా లోకేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

అశోక్‌ను కలిసిన డ్వామా పీడీ

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి బుధవారం వెళ్లి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధి పనులకు సంబంధించి నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న పనుల వివరాలను అశోక్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కవిటి మండలం నెలవంక పంచాయతీ పరిధిలో జరుగుతున్న సిమెంట్ కాంక్రీట్ రోడ్డు పనులను పీడీ పరిశీలించారు.

రక్తదానంపై అపోహలు వద్దు

రక్తదానం చేస్తున్న కానిస్టేబుళ్లు

ప్రజాశక్తి- పలాస

రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణం కాపాడుతుందని, యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, దీనిపై ఎటువంటి అపోహలకు లోనుకావద్దని కాశీబుగ్గ, రూరల్ సిఐలు డి.మోహనరావు, ఎం.తిరుపతి అన్నారు. కాశీబుగ్గ పోలీసు స్టేషన్ పరిధిలో పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం జెమ్స్, రిమ్స్ ఆస్పత్రుల ఆధ్వర్యాన బుధవారం రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు అన్నారు. రోడ్డు ప్రమాదం, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకునేందుకు రక్తదానం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు రక్త నిల్వలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎంతోమంది ప్రాణాలను కోల్పోతున్నారని, దీంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని స్పష్టం చేశారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ పరిధిలో 34 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది, ఇతరులు రక్తదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం వైద్య శిబిరంలో 265 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెమ్స్ ఆస్పత్రి మేనేజర్ చిన్నారావు, మార్కెటింగ్ ఏరియా మేనేజర్ రాపాక తిరుపతిరావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

అగ్నిప్రమాదాలు జరిగే సమయంలో ఆందోళన అప్రమత్తంగా వ్యవహరించాలని అగ్నిమాపక అధికారి బొడ్డేపల్లి హరినారాయణ అన్నారు. మండలంలోని చిన్నికృష్ణాపురంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అగ్నిప్రమాదాలు జరిగేటప్పుడు ఎలా వ్యవహరించాలో బుధవారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగే సమయం లో ఆందోళన చెందకుండా తీసుకోవలసిన నివారణ చర్యల గురించి తెలిపారు. వంట గదిలో గ్యాస్ వాడేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను, అగ్ని ప్రమాదాల్లో చిక్కుకున్న గాయపడిన వారిని ఎలా రక్షించాలో వివరించారు. కార్బన్డయాక్సైడ్ ఎక్స్టింగ్ ఫిషర్ పనితీరు ఏరకంగా ఉంటుందన్న దానిపై అవగాహన కల్పించారు. దీపావళి సందర్భంగా పాఠశాల చిన్నారులు తీసుకోవలసిన

అవగాహన కల్పిస్తున్న హరినారాయణ

జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పర్యావరణ రహితంగా దీపావళి పండుగ జరుపుకోవాలని సూచించారు. ఇంటి వద్ద గ్యాస్ సిలిండర్‌కు నిప్పు అంటుకుంటే ఏ విధంగా అప్రమత్తం కావాలో వివరిస్తూ నిప్పుని ఆపేందుకు ఆక్సిజన్ లేకుండా చేస్తే సరిపోతుందని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటరత్నమ్మ ఉపాధ్యాయులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి- టెక్కలి

జిల్లా విభజన నేపథ్యంలో జిల్లా నుంచి వేరైన ఐటిడిఎని మెళియాపుట్టి కేంద్రంలో ఏర్పాటు చేస్తామని ఇన్నికల ప్రచారంలో సిఎం చంద్రబాబు నాయుడు హామీనిచ్చారని, దానిని నిలబెట్టుకోవాలని ఆదివాసీ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పలాసలో జరిగిన బహిరంగ సమావేశంలో నాటి ప్రతిపక్ష నాయకుని హోదాలో హామీనిచ్చారని గుర్తు చేశారు. నవంబరు 1న ఇచ్ఛాపురంలో పర్యటన నేపథ్యంలో ఐటిడిఎ ఏర్పాటుకు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

ఐటిడిఎ లేకపోవడంతో జిల్లాకు చెందిన గిరిజనులు పడుతున్న ఇబ్బందులను గ్రహించాలన్నారు. గిరిజనులకు, ఆదివాసీలకు అవసరమైన ఏ ఒక్క చిన్నపనికైనా మన్యం జిల్లాకి వెళ్లడం, రావడంతో ఆర్థికంగా భారం, దూరప్రయాణతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో జిల్లా అధ్యక్షులు గురడి అప్పన్న, రాజు, పాపారావు తదితరులు ఉన్నారు.

నిరసన తెలుపుతున్న ఎల్ఐసి ఏజెంట్లు

ఎల్ఐసి ఏజెంట్ల నిరసన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఎల్ఐసిలో ఇటీవల తీసుకొన్న కొన్ని నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ఎల్ఐసి సాటిలైట్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. పాలసీపై బోనస్ పెంచాలన్నారు. పాలసీలపై జిఎస్‌టిని రద్దు చేయాలన్నారు. ఏజెంట్లకు కమీషన్లు పెంచాలన్నారు. పాలసీలను పాత పద్ధతిలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముత్యాల శ్రీనివాస్‌రాజు, పి.ఢిల్లేశ్వరరావు, మట్ట ధర్మరాజు, కొణతాల దివాకర్‌రెడ్డి, కాపలా తిరుపతిరావు, దుర్యోధనరెడ్డి, వెంకటరావు, గిరిబాబు రెడ్డి, బుడంకాయల వెంకట రమణ, గోవింద, సూర్యకుమార్, రాధాకృష్ణ, సీతారాం, రాజు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మాట్లాడుతున్న సాయికుమార్

నైపుణ్యాలతోనే ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి- మెళియాపుట్టి

విద్యార్థులు ఏ కోర్సు చదివినా అందులో నైపుణ్యం ఉన్నవారికి ఉద్యోగ అవకాశాలు దక్కుతున్నాయని, అందుకే యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైందని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎన్ఆర్‌ఇజిఎస్ కార్యాలయంలో ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాణ నైపుణ్య గణన 2024 మండలస్థాయి శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆటోమేషన్ కృత్రిమ మేథ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. భవిష్యత్‌లో రాగల మార్పులకు అనుగుణంగా యువత కూడా తమ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహప్రసాద్ పండా, కార్యదర్శులు చింతల అప్పారావు, శివాజీ, మోహనరావు, సత్యనారాయణ, నాగమణి, ఢిల్లేశ్వరరావు, పానిల యుగంధర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మున్సిపాలిటీ పరిధిలో ఉన్న నిరుద్యోగ యువతీ ఉపాధి అవకాశాలు పొందడానికి నైపుణ్యత ఎంతో అవసరమని ఇన్‌ఛార్జి కమిషనర్ జాన్సన్ అన్నారు. ఎపిఎస్-ఎస్‌డిసి నోడల్ ఆఫీసర్ బొడ్డేపల్లి చంద్రమౌళి పర్యవేక్షణలో బుధవారం మున్సిపల్ కార్యాలయంలో స్కిల్ సెన్సెస్ లో భాగంగా వార్డు సచివాలయం ఉద్యోగులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ బిసాయి బొడ్డేపల్లి శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ ఎ.వి.శ్రీనివాసరావు, బొడ్డేపల్లి ఉదయ్‌కుమార్, జి. భాస్కరరావు పాల్గొన్నారు.

మందస : యువత అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించాలని స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ సోమేశ్వరరావు, మాస్టర్ ట్రైనింగ్ యువరాజ్, శ్రావణ్‌లు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నైపుణ్య గణన శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సూర్యనారాయణ, ఎఒ రుశ్వేశ్వరరావు, ఇఒపిఆర్‌డి జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

పాల్గొన్న కౌన్సిలర్లు, మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణం ప్రవేశ ముఖద్వారంలో బాహుదా నదికి వెళ్లే దారిలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణమణి మాట్లాడుతూ వచ్చేది కార్తీక మాసం కావడంతో జగనన్న కాలనీ వాసులు రాకపోకలకు ఇబ్బంది లేకుండా రాజావారి కోట నుంచి నది మార్గంలో వీధి దీపాలు అవసరమని అన్నారు. శ్మశాన వాటిక వద్ద కూడా రాత్రి వేళలో దహన సంస్కారాలు చేయడానికి అనువుగా విద్యుత్ దీపాలు వేయాలని కోరారు. పట్టణంలో కొద్ది రోజులుగా విష జ్వరాలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని వార్డు కౌన్సిలర్ మధుమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యాధికారులతో మాట్లాడి ప్రతి వార్డులో ఉచిత వైద్య శిబిరం చేసి రోగులకు మందులను ఉచితంగా అందజేయాలని విన్నవించారు.

డబ్బురు వీది, కాళికా మాత ఆలయం వెనుక రోడ్డులో అడ్డంగా గోడ కట్టారని, అధికారులు స్పందించి వాటిని తొలగించాలని కోరారు. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్ ప్రసాద్ సమాధానం సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇచ్చామని తెలిపారు. తన వార్డులో ఏడు రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదని కౌన్సిలర్ ఆసి లీలారాణి తెలిపారు. పట్టణంలో రోడ్లపై విచ్చల విడిగా పశువులు ఉండడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని వైస్ చైర్‌పర్సన్ భారతీదివ్య, వార్డ్ కౌన్సిలరు బచ్చ జగన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ అధికారులు అదే పనిలో ఉన్నారని వివరించారు. అంతకుముందు ఎజెండాలోని ఆరు అంశాలు కౌన్సెల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మేనేజర్ అప్పలస్వామి, కో-ఆప్షన్ సభ్యులు ప్రత్తి విజయకుమార్, సయ్యద్ సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

పొందూరు: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని ఎపిఒ పి.శ్రీనివాసరావు అన్నారు. పొందూరు మండలం రాపాక సచివాలయం-1లో శ్రీకాకుళం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యాన బుధవారం ‘ఏక్ పెడ్ మా కా నామ్’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం ఆవరణంలో పలు రకాల మొక్కలను నాటారు. సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన వెంకట రావు, మండల తెలుగు యువత కార్యదర్శి కండాపు శ్రీనివాసరావు, కార్యదర్శి పి.శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న అధికారులు

4న విఆర్ఎల ధర్నా

ప్రజాశక్తి- పొందూరు

వినతిపత్రం అందజేస్తున్న విఆర్ఎలు

విఆర్ఎ సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నవంబరు 4న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు తెండేల త్రినాథరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో డిటి వెంకటేశ్వరరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని విఆర్ఎలందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఈయనతో పాటు మండలంలోని పలువురు విఆర్ఎలు ఉన్నారు.

హరిత దీపావళిపై అవగాహన

లావేరు : ప్రతిఒక్కరూ పర్యావరణనికిహాని లేకుండా హరిత దీపావళిని జరుపుకోవాలని బుడుమూరు జెడ్‌పి పాఠశాల హెచ్ఎం ఉరిటి శ్రీనివాసరావు, ఈ మేరకు విద్యార్థులకు పాఠశాల ఆవరణలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణనికి హాని లేకుండా దీపావళి జరపడం, పువ్వులు అలంకరణలు, దీపాలు వెలిగించడం వరి పిండి, పసుపు కుంకుమ, పువ్వులతో ముగ్గులు వేయడం వంటి నమూనాలు వేసి చూపించారు. ఎపిఎన్‌జిసి జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు మాట్లాడుతూ పెద్ద పెద్ద శబ్దాలతో మందుగుండు సామగ్రి కాల్చితే వచ్చే అనర్థాలపై వివరించారు. భవిష్యత్ తరాలకు మన భూమిని మనం సురక్షితంగా ఉంచుకోవాలన్నారు. పటాకుల వాడకాన్ని తగ్గించి ప్రకృతిని రక్షించేందుకు చేసే ప్రయత్నంలో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.కె.ప్రసాదరావు, ఎం.అనురాధ, తమ్మినాయుడు, పెంటయ్య, రమేష్, రమణమ్మ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : వెలుగుల దీపావళి పండుగను ప్రతిఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని జనసేన నాయకులు, గైనిక్ వైద్య నిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని సింహద్వారం వద్ద ఉన్న మెడికవర్ ఆస్పత్రి బుధవారం విలేకరులతో మాట్లాడారు. జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ కాలుష్య రహిత దీపావళి పండుగను జరుపుకోవాలన్నారు.

లావేరు : ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

నట్టల నివారణ మందుల పంపిణీ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

నట్టల నివారణ మందులను గొర్రెలు, మేకలు పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు అన్నారు. మండలంలో జాడుపల్లిలో జరుగుతున్న డి వార్మింగ్ కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొర్రెలు, మేకల పెంపకందారులు అందరూ తమ జీవాలకు తప్పనిసరిగా ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న నట్టల నివారణ మందులు, వ్యాధి నిరోధక టీకాలు వినియోగించుకోవాలన్నారు. డి వార్మింగ్ మందులు ఉపయోగించడం వల్ల గొర్రెల్లో, మేకల్లో మరణాల శాతం తగ్గుతుందని, శరీర బరువు పెరిగి మాంసం ఉత్పత్తి అభివృద్ధి చెంది తద్వారా గొర్రెల పెంపకందారుడు ఆర్థికంగా ప్రయోజనం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కన్నబాబు, ఎంపిటిసి రాజు, పి.ఎల్.పురం ఇన్‌ఛార్జి, పశువైద్యాధికారిని డాక్టర్ కె.మౌనిక, పశు వైద్య సహాయకులు సరస్వతి, మీనాక్షి, గణపతి, చిన్నారావు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులను వేస్తున్న డాక్టర్ కరుణాకరరావు

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కూటమి ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాశక్తి- పాతపట్నం

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి అయిదు నెలలకాలంలో అన్ని విధాలా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి విమర్శించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు పూర్తిగా అటకెక్కించారని అన్నారు. ఒక్క పథకమూ ఏ పేదవానికీ అందడం లేదని అన్నారు. ఎన్నికల ముందు సిఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రకరకాల వాగ్దానాలను ఇచ్చారని గుర్తు చేశారు. ప్రతి మహిళకూ ఉచిత బస్సు, 18 నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.15 వేలు అకౌంట్లలో వేస్తామని చెప్పారని అన్నారు. 20 లక్షల నిరుద్యోగాలు, యువతకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి, రైతు భరోసా కింద రూ.20 వేలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

559 జిఒను అమలు చేయాలి

ప్రజాశక్తి- నందిగాం

జిఒ 559, 1016ను తక్షణమే అమలు చేసి గొర్రెలు, మేకలు పెంపకందారులను ఆదుకోవాలని ఎపి గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సాంబమూర్తి ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని 40 వేలు గొర్రెల, మేకల పెంపకం దారులకు కుటుంబాలకు బంజరు భూములు, గోర్జి, పోరం పోగులు భూములను కేటాయించాలన్నారు. బంజరు భూములు, కాలువ గట్టు, చెరువు గర్భాలు వద్ద తుమ్మ చెట్లను గొర్రెల మేకల పెంపకం దారులకు కల్పించాలన్నారు.

వీధిలైట్లను అందజేస్తున్న జనసేన నాయకులు

వీధిలైట్లు వితరణ

మెళియాపుట్టి : మండలంలోని నిర్వాసిత గ్రామమైన చీపురుపల్లికి నియోజకవర్గ జనసేన నాయకులు కోరికాన భవాని 50 ఎల్ఇడి వీధిలైట్లను వితరణగా బుధవారం అందించారు. ఈమె నాలుగు రోజుల క్రిందట నిర్వాసిత గ్రామాన్ని సందర్శించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు గ్రామస్తులకు వీధిలైట్లను మండల జనసేన నాయకులు దుక్క బాలరాజు, లక్ష్మీపురం కిరణ్ వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎవ్వరి ఈశ్వరరావు, చిరునగిరి ప్రసాద్, సత్యనారాయణ, అజయ్‌కుమార్, విజయకుమార్ దొర, భరత్, మోహనబాబు పాల్గొన్నారు.

ఘనంగా పటేల్ జయంతి

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ముందుగా పటేల్ చిత్రపటానికి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగం అధిపతి, టి.త్రినాథరావు, జాతీయ సేవా పథకం పిఒలు కంది గోళ్ల, డి.వాసు, చరిత్ర అధ్యాపకులు కోటేశ్వరరావు, ఎస్.ధర్మారావు, కె.శ్రీనివాసరావు, జగన్నాథ్ బిసాయ్ పాల్గొన్నారు.

మేకల పెంపకందారులకు శిక్షణ

శ్రీకాకుళం అర్బన్ : నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం అమలులో భాగంగా నగరంలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో గొర్రెలు, మేకల పెంపకందారులకు బుధవారం రెండో విడత శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా తరగతులకు 50 మంది రైతులు హాజరయ్యారు. శిక్షణా తరగతులను పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మురళీధర్ ప్రారంభించారు.

అవగాహన కల్పిస్తున్న యతిరాజారావు

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి- నరసన్నపేట

కేన్సర్ వ్యాధిపై విద్యార్థులు అవగాహన కలిగి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సెంటర్ ఫర్ సెల్యులార్ మాలిక్యులర్ బయాలజీ (సిసిఎంబి)కు చెందిన పరిశోధకులు తమ్మినేని యతిరాజారావు పిలుపునిచ్చారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో కేన్సర్ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం అవగాహన కల్పించారు. కేన్సర్ కారణాలు, లక్షణాలు, నివారణ, చికిత్స గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడు రకాల కేన్సర్లతో ప్రజలు బాధపడుతున్నారన్నారు. లంగ్స్, బ్రెస్ట్, నోటి, గర్భాశయ, కడుపు, అన్నవాహిక, లివర్ కేన్సర్లతో ఎంతో మంది బాధపడుతున్నారని తెలిపారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే కేన్సర్‌ను నియంత్రించవచ్చు నన్నారు. కళాశాల బోటనీ అధ్యాపకుడు డి.బాబ్జీ మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి అతి ప్రమాదకరమైనదని, దీనిపై అపోహలు ఉన్నా వాటిని నివృత్తి చేసేందుకు చేపడుతున్న ప్రభుత్వ, ఎన్‌జిఒ కార్యక్రమాలు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఇన్‌ఛార్జి ముకల్ల శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి సంబరాలు

ప్రజాశక్తి- పాతపట్నం

స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో బుధవారం ఘనంగా ముందస్తు దీపావళి సంబరాలు నిర్వహించారు. ఆనందంగా, ఉత్సాహంగా అందరూ సమైక్యంగా జరుపుకునే పండగే దీపావళి ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌ఛార్జి ఎన్.వెంకటేష్ పాల్గొన్నారు. చిన్నారుల వస్త్రాలంకరణ, వేషధారణలు, రంగు రంగుల రంగవల్లికలు, దీపకాంతులు ఆహుతులను ఎంతగానో అలరించాయి.

బివికెలో నరకాసుర వధ

కవిటి: కవిటి కొత్తూరు బివికె పాఠశాలలో దీపావళి వేడుకలను పురస్కరించుకుని బుధవారం నరకాసుర వధ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరకాసుర వధకు దీపావళికి ఉన్న సంబంధాన్ని ప్రిన్సిపాల్ అనిల్ విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు దీపాలు వెలిగించి వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది శిరీష, సుహాసిని, జ్యోతి మాధవమ్మ, దున్న జ్యోతి, కృష్ణకుమార్, అంజలి మహారాణ, రాజేశ్వరి, యూన్సీ, లక్ష్మి, అశోక్, రాజేష్, అంజలి పాల్గొన్నారు.

కవిటి : నరకాసుర వధ చేస్తున్న చిన్నారి

టెక్కలి రూరల్ : టెక్కలిలోని బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలో దీపావళి సంబరాలు నిర్వహించారు. ముందుగా లక్ష్మీదేవి విగ్రహానికి పూలమాలలు వేశారు.

కూలీలందరికీ 'ఉపాధి' పనులు

లావేరు: గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ప్రారంభించి కూలీలందరికీ పనులు కల్పించాలని ఎంపిడిఒ వెంకట్ రాజు అన్నారు. ఉపాధి హామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబ్ కార్డులు వాందరికీ వంద రోజులు పని కల్పించాలన్నారు. లేని వారికి జాబ్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. ఫారం పండ్ల హరితవనాలు కార్యక్రమంలో భాగంగా రహదారులకిరువైపులా మొక్కలు నాటాలని అన్నారు. నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎపిఒ రెడ్డి సత్యవతి పాల్గొన్నారు.

అబలకు అండగా 'అభివృద్ధి సంఘం'

ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

కవిటి: కడుపులో తయారైన కాయ కేన్సర్‌గా మారి తీవ్రమైన వ్యాధిగా మారడంతో వైద్య ఖర్చులకు కూడా డబ్బులు లేని ఓ అబలకు కవిటికి చెందిన అభివృద్ధి సంఘం ఆర్థికసాయం అందించి మానవత్వం చాటుకుంది. కవిటి మండపం వీధికి చెందిన పొల్లాయి కుమారికి కడుపులో కాయ ఏర్పడి అది కేన్సర్‌గా మారింది. అంతేకాకుండా ఆపరేషన్ సమయంలో గర్భసంచి కూడా తొలగించాల్సి ఉంటుందని, వైద్యం కోసం రూ.లక్షల్లో ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పడంతో రెక్కాడితే గానీ డొక్కాడని కుమారి దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. విషయం తెలుసుకున్న గ్రామ అభివృద్ధి సంఘం బుధవారం కుమారి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. తమ వంతుగా కుమారి వైద్యం కోసం రూ.26 వేలు అందించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణమూర్తి, పాండవ శేఖర్, ఆరంగి మధు, పొల్లాయి ఉమా, ఆరంగి రాజు, బెందాళం సురేష్, తెప్పల మోహనరావు, పొల్లాయి సింహాచలం, మొగిలిపురి నాగేశ్వరరావు, మొగిలిపురి సీతారాం, గొరకల రామారావు, తెప్పల దశరథ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత సాధించాలి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించుకుని సొంతంగా బ్యాంకు సేవలు చేసుకోవాలని డిసిసిబి డిజిఎం బసవలింగం అన్నారు. మండలంలోని బోరుభద్రలో ఆర్థిక అక్షరాస్యతపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా సీనియర్ సిటిజన్స్‌కు, పదేళ్లలోపు పిల్లలకు ప్రత్యేక డిపాజిట్ పథకం ఉందన్నారు. దీపావళి సందర్భంగా ధనవర్ష పథకం ప్రవేశపెట్టామని, దీనిపై 333 రోజులకు 7.5 శాతం వడ్డీ ఇస్తామన్నారు. వ్యవసాయ రుణాలు తక్కువ వడ్డీకే అందిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఉషాశాంతి, సూపర్‌వైజర్ రవిచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

లేగదూడల పెంపకంపై దృష్టి

సారవకోట: రైతులు పశుపోషణలో భాగంగా లేగదూడలు పెంపకంపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే రమణమూర్తి సూచించారు. మండలంలోని కిన్నెరవాడలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యాన లేగదూడల ప్రదర్శనను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశు సంపద అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. పశువుల ఉత్పత్తి పెంచేందుకు అనేక పథకాలు అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 21వ జాతీయ పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి చిన్నాల కూర్మినాయుడు, పశు వైద్యాధికారి పాల్గొన్నారు.

కృష్ణదాస్ పరామర్శ

నరసన్నపేట : మండలంలోని ముద్దాడపేటలో బుధవారం మృతి చెందిన బగ్గ ఆదినారాయణ కుటుంబ సభ్యులను వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ బుధవారం పరామర్శించారు. ఈయన వెంట ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి చింతు రామారావు, కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ రాజాపు అప్పన్న, పిఎ సిఎస్ మాజీ అధ్యక్షులు నర్సింగరావు, సర్పంచ్ పి.రవి, ఎంపిటిసి శ్రీరాములు ఉన్నారు.

మోడల్ స్కూల్‌లో విద్యార్థుల ఎన్నికలు

పాతపట్నం : స్థానిక ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి విద్యార్థి నాయకులను ఎన్నుకోవడానికి బుధవారం ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోటానికి, ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగించటానికి ఈ ఎన్నికలు దోహదపడతాయని ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరావు తెలియజేశారు. ఈ ఎన్నికల్లో 600 మంది విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కౌంటింగ్ ప్రక్రియ ముగించి ఫలితాలను వెల్లడించారు. ఈ ఎన్నికల్లో పాఠశాల విద్యార్థి నాయకులు (ఎస్‌పిఎల్)గా సౌమ్య సాంతో, ఎఎస్‌పిఎల్‌గా దారవు సందీప్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వి.నీలయ్య, ఆర్.మోహనరావు రాజేంద్రప్రసాద్, ఎం.వి.రాజు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

వజ్రపుకొత్తూరు: ఉద్యోగి అందించిన సేవలే గుర్తింపును తీసుకొస్తాయని వజ్రపుకొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి తేజస్విత అన్నారు. బుధవారం ఆస్పత్రి ఆవరణలో నిర్వహించిన బుక్కూరు నీలవేణి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. 34 ఏళ్లుగా ఆమె కార్యాలయ సహాయకులుగా, ఎంతో నిబద్ధతతో సేవలు అందించారని కొనియాడారు. అందరిని ఆప్యాయంగా పలకరించే నీలవేణి తలలో నాలుకలా తోటి సిబ్బంది ప్రజలు మన్ననలు పొందారన్నారు. మనం చేసిన పని ఉద్యోగ విరమణ తరువాత కూడా ప్రజలు గుర్తించినప్పుడే ఆ ఉద్యోగికి నిజమైన గౌరవం, సంతృప్తి లభిస్తాయని ఆమె అన్నారు. వైద్యులు వాహిని ప్రియాంక, విజయకుమార్‌రెడ్డి, చక్రధర్, బోనేలా గోపాల్, గురయ్యనాయుడు, బాలకృష్ణ పాల్గొన్నారు.